
2

**వెంచర్ల జోరు..**

నిబంధనల అమలు ఎంతవరకు?

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -40 శుక్రవారం 10 జులై 2026 ఎడిటర్: బిర్రు కరుణాకర్ పేజిలు 4 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## విశాఖలో కియా ఎక్స్‌పోర్ట్ సెంటర్

**శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్.. కొరియాలో లోకేశ్ కీలక భేటీలు**

**దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్**

**శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటు చేయాలని సునిక్ సిస్టమ్స్‌కు విజ్ఞప్తి**

**ఏపీలో ఈవీ హబ్, విశాఖలో ఎక్స్‌పోర్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కియాకు ప్రతిపాదన**

**కొరియా ఉపమంత్రితో భేటీ.. ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ ఏర్పాటుకు విజ్ఞప్తి**


2లో

# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నా కల

**2036 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించటమే లక్ష్యం**

**గాంధీ స్ఫూర్తితో యంగ్ ఇండియా పేరుతో విశ్వవిద్యాలయం**

**స్పోర్ట్స్ యూనివర్శిటీ లోగో ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్ జులై 9.(జర్నలిస్ట్ వార్త)** 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించటం నా కల. అందుకే హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌తో పాటు యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్శిటీ లోగోలు, నమూనాలను భారత ఒలింపిక్ ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పిటి. ఉషతో కలిసి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. మిగతాది 2లో...



## బంధం మరింత బలోపేతం

**ఆస్ట్రేలియాతో బంధంపై ప్రధాని మోదీ ఆసక్తికర క్రికెట్ పోలికలు**

**ఇరు దేశాల మధ్య కీలకమైన అణు సహకార ఒప్పందం ఖరారు**

**ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించిన ఇరు దేశాల ప్రధానులు**

**రక్షణ, వాణిజ్యం, విద్య, కీలక ఖనిజాలపై విస్తృత చర్చలు**

**ఈ బంధం ఎన్నడూ లేనంత కీలకం అన్న ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్**

## ధాన్యం కొనుగోలులో రికార్డు

**వినూత్న సంస్కరణలతో రైతులకు మేలు**

**పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

**విజయవాడ,జులై 9.(జర్నలిస్ట్ వార్త)**

గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలను అమలు చేసిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతులు, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమ ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు. మిగతాది 2లో...



## బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్లు

**ఈ అవినీతి సొమ్మును అమరవీరుల కుటుంబాలకు పంచాలి**

**సింగరేణిని నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ బీఆర్ఎస్ లోకి వెళ్లేది లేదు**

**'సింగరేణి బావి బాట'లో భాగంగా కొత్తగూడెంలో కల్వకుంట్ల కవిత పర్యటన**

**కొత్తగూడెంజులై 9.(జర్నలిస్ట్ వార్త)**

బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్ల అవినీతి సొమ్మును అమరవీరుల కుటుంబాలకు పంచాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు., తన కంఠంలో ప్రాణం ఉండగా బీఆర్ఎస్‌లోకి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న 'సింగరేణి బావి బాట' కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కవిత పర్యటించారు. ఉదయం కొత్తగూడెం ఏరియాలోని ఫైవ్ షాఫ్ట్ గనిని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూర్యాప్యాలస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సింగరేణి కోసం తాను ఉద్యమంలో, ప్రభుత్వంలో పనిచేశాననీ, మిగతాది 2లో...



## మూసీ ప్రాజెక్టు మొదటి దశకు ప్రభుత్వం అనుమతి

**రూ. 7,345 కోట్లతో జోన్-1 పనులకు గ్రీన్‌సిగ్నల్**



**హైదరాబాద్‌జులై 9.(జర్నలిస్ట్ వార్త)**

మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు మొదటి దశకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.7,345 కోట్లతో జోన్-1 పనులు చేపట్టేందుకు అనుమతినిచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం ఏసియా డెవలంప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) రూ.4,500 కోట్ల రుణం ఇస్తోంది. ఆ నిధులతో బోర్డు మిగతాది 2లో...

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

**దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం**

**హైదరాబాద్,జులై 9.(జర్నలిస్ట్ వార్త)**

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కు ఊరట లభించింది. పోక్సో కేసులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. దర్యాప్తునకు సహకరించాలని బండి భగీరథ్‌ను ఆదేశించింది. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో అతడిపై పోక్సో కేసు నమోదైంది. మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మిగతాది 2లో...



# పరిశ్రమలకు ఓఆర్ఆర్ బయట భూములు

**ఇండియాస్ నెక్స్ట్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభంలో సిఎం రేవంత్**

**దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు**

**తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలింపు**

**హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి తప్పించే చర్యలు**

**హైదరాబాద్,జులై 9.(జర్నలిస్ట్ వార్త)**

2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్స్ట్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే.. స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఏటా 1.10 లక్షల మంది, మిగతాది 2లో...



## బిఆర్ఎస్ రాజ్యసభ నేతగా వద్దిరాజు

**సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో కెసిఆర్ నిర్ణయం**

**హైదరాబాద్,జులై 9.(జర్నలిస్ట్ వార్త)**

రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫ్లోర్ లీడర్ గా నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడుగా, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కేఆర్ సురేష్ రెడ్డి పదవీకాలం ముగియడంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు నియామకం బీసీల, తెలంగాణ హక్కుల సాధనలో కీలకంగా మారుతారని సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ అన్నారు. వద్దిరాజు రవిచంద్ర సేవలను గుర్తించి కీలకమైన బాధలు అప్పగించిన కేసీఆర్‌కు మున్నూరు కాపు సమాజం కృతజ్ఞతలు తెలుపుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన హక్కుల సాధనలో వద్దిరాజు కృషి మరింత పెరగడానికి అవకాశం దక్కిందని పేర్కొన్నారు.



# బంధం మరింత బలోపేతం

### ఆస్ట్రేలియాతో బంధంపై ప్రధాని మోదీ ఆసక్తికర క్రికెట్ పోలికలు

**మెల్‌బోర్న్,జులై 9.(జర్నలిస్ట్ వార్త)**
భారత్, ఆస్ట్రేలియా మధ్య బంధం ఎంత వేగంగా, ఎంత పటిష్ఠంగా ఉందో ప్రధాని నరేంద్ర మోదీ క్రికెట్ పోలికలతో చక్కగా వివరించారు. మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి నిర్వహించిన వార్షిక సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య నిర్ణయాలు టీ20 మ్యాచ్ అంత వేగంగా జరుగుతాయని, ఈ భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్ అంత లోతైనదని, పటిష్ఠమైనదని ఆయన అభివర్ణించారు.మూడు దేశాల పర్యటనలో భాగంగా ఇండోనేషియాలో పర్యటన ముగించుకుని నిన్న మెల్‌బోర్న్‌కు చేరుకున్న ప్రధాని మోదీ, ఇవాళ అల్బనీస్‌తో కలిసి సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాల దృష్ట్యా వ్యూహాత్మక, ఆర్థిక, భద్రతా రంగాల్లో సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది.ప్రపంచ క్రీడా రాజధానిగా పేరుగాంచిన మెల్‌బోర్న్‌లో, రెండు దేశాలను కలిపే 'దౌత్య భాష' క్రికెట్ అని మోదీ అన్నారు. "మా సమావేశాలు ఒక క్రికెట్ మ్యాచ్ లాంటివి. మా ఎజెండా వన్డే ఇంటర్నేషనల్ అంత స్పష్టంగా ఉంటుంది. మా నిర్ణయాలు టీ20 మ్యాచ్ అంత వేగంగా ఉంటాయి. మా భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్ అంత శాశ్వతమైనది, లోతైనది" అని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు.ఈ సదస్సులో ఒక చారిత్రాత్మక అణు సహకార ఒప్పందం కుదరడం అత్యంత కీలక పరిణామం. ఇది ఇరు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త కోణాన్ని ఇచ్చింది. దీంతో పాటు ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ తీవ్రంగా ఖండిస్తూ ఇరు దేశాధినేతలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్, సిడ్నీలోని బాండీ బీచ్‌లో ఇటీవల జరిగిన దాడులను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉగ్రవాద నిర్మూలనకు సమాచార మార్పిడి, ఆన్‌లైన్ తీవ్రవాదంపై పోరాటం, ఐక్యరాజ్యసమితి నిషేధిత ఉగ్రవాద సంస్థలు, వాటి నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకోవడంలో సహకరించుకోవాలని ఇరు దేశాలు ప్రతిజ్ఞ చేశాయి.

# ధాన్యం కొనుగోలులో రికార్డు

(మొదటి పేజి తరువాయి)
కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తవడంపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో అధికారులు బాగా పని చేశారని కొనియాడారు. రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో 74 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని వివరించారు. రూ.31 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బీపీటీ బియ్యం అందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న 10 శాతం బ్రోకెన్ రైస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రతి ధాన్యం బస్తాకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, రైతు నుంచి ఫెయిర్ ప్రైస్ షాప్ వరకు పూర్తి వివరాలు తెలుసుకునే వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. గన్నీ బ్యాగులు, గోదాములు, రవాణా, తేమ శాతం వంటి అంశాల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకున్నామని నాదెండ్ల తెలిపారు. ఖరీఫ్ నుంచి రైతు సేవా కేంద్రాల్లోనే గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. రవాణా జాప్యాన్ని నివారించేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను కూడా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఆర్ఎఫ్ఐడీ స్టిక్కర్లు, స్కానర్లతో లారీల కదలికలను పర్యవేక్షించే వ్యవస్థ అమలు చేస్తున్నామని చెప్పారు. తేమ కొలిచే మాయిశ్చర్ మీటర్లు అన్ని చోట్లా ఒకే కంపెనీ, ఒకే మోడల్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 90 శాతం ఏర్పాటు పూర్తవగా, ఖరీఫ్ నాటికి 100 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వరి ఉత్పత్తి సుమారు 15 శాతం తగ్గే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు ఉన్నాయన్నారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, అవసరమైన సూచనలు అందించి సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నా కల

(మొదటి పేజి తరువాయి)
ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'గత 10 ఏండ్లుగా తెలంగాణకు క్రీడా విధానం లేదు. ఓ పాలసీ లేకుండా ప్రభుత్వం, అధికారులు ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు. అందుకే, మా ప్రభుత్వం వచ్చిన రెండేండ్లలో స్పోర్ట్స్ పాలసీ రూపొందించాం. 20 ఏండ్ల కిందటే ఆఫ్రో ఏసియా, ప్రపంచ మిలటరీ గేమ్స్‌కు ఆతిథ్యం అందించిన చరిత్ర హైదరాబాద్‌కు ఉంది. కానీ గత ప్రభుత్వ హయాంలో స్టేడియాలను పెండ్లిలకు, విందులకు ఇతర వేడుకలకు అద్దెకు ఇవ్వటం దురదృష్టకరం. స్వేచ్ఛ కోసం పోరాడేందుకు మహాత్మా గాంధీ యంగ్ ఇండియా పత్రికను నడిపారు. ఆ స్ఫూర్తితోనే క్రీడా విశ్వవిద్యాలయానికి యంగ్ ఇండియా పేరు పెట్టాం.క్రీడల్లో రాణించేందుకు పాలసీలు, శిక్షణ, అకాడమీలు, విశ్వవిద్యాలయం అవసరం. 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. అప్పుడు హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించటం నా కల. 2036 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించగల అథ్లెట్లను తయారు చేసేందుకు తెలంగాణ చిత్తశుద్ధితో పని చేస్తోంది. క్రీడల్లో రాణించిన నిఖత్ జరీన్, ఇషా సింగ్, మహ్మద్ సిరాజ్, దీప్తి జీవాంజిలకు ప్రభుత్వ ఉద్యోగాలు అందించాం. క్రీడలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంది. 2028లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీని ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మాట ఇస్తున్నాను' అని అన్నారు. క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.భారత్‌లో, తెలంగాణలో బలమైన స్పోర్ట్స్ కల్చర్‌కు యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు అతిపెద్ద అడుగు అని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పిటి ఉష అన్నారు. 'ఓ అథ్లెట్‌గా చెబుతున్నాను.. మనకు మంచి క్రీడాకారులతో పాటు మంచి కోచ్‌లు, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ ఎంతో అవసరం. ఫిజికల్ ఎడ్యుకేషన్, పారా స్పోర్ట్స్‌పై దృష్టి నిలుపుతున్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు. ఈ యూనివర్శిటీ నుంచి కోచ్‌లు, రిఫరీలు, అడ్మినిస్ట్రేటర్లు తయారు కావాలి. యంగ్ ఇండియా స్పోర్ట్స్ ఫెలోషిప్ ప్రవేశపెట్టడం అభినందనీయమని' పిటి ఉష తెలిపారు.

**నగదు ప్రోత్సాహకలు అందజేత**
అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన తెలంగాణ క్రీడాకారులకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పారా అథ్లెట్, పారిస్ పారాలింపిక్స్ మెడలిస్ట్ దీప్తి జీవాంజికి రూ.50 లక్షలు, షూటర్ ఇషా సింగ్‌కు రూ.3.30 కోట్లు, పారా షూటర్ ధనుశ్ శ్రీకాంత్‌కు రూ.2.10 కోట్లు, బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ.60 లక్షలు, తనీశ్‌కు రూ.53 లక్షలు, సురభి భరద్వాజ్‌కు రూ.10 లక్షల చెక్‌లు అందించారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్శిటీ లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి జయశ్ రంజన్‌తో పలు కంపెనీలు ప్రతినిధులు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. పారా అథ్లెట్ల ప్రతిభాన్వేషణకు ఆదిత్య మెహతా ఫౌండేషన్‌తో ఎంవోయూ పత్రాలు మార్చుకున్నారు.


# నేతన్నల బతుకుచిత్రం..

## పద్మశాలీల ప్రగతి ప్రస్థానం!

నాగరికతకు తొలి నూలుపోగు అద్దిన ఘనత చేనేతది. మనిషికి మానాన్ని, సమాజానికి గౌరవాన్ని ఇచ్చే వస్త్ర సృష్టి వెనుక ఒక వర్గం శతాబ్దాల తపస్సు దాగి ఉంది. వారే పద్మశాలీలు. పద్మ అంటే కమలం, శాల అంటే ఇల్లు కమలంలో నివసించే లక్ష్మీనారాయణుల అనుగ్రహంతో, సృష్టికర్త బ్రహ్మ మానస పుత్రుడైన భృగు మహర్షి వంశీయుడిగా, మార్కండేయ మహర్షి వారసత్వంతో వస్త్ర నిర్మాణ కళను లోకానికి పరిచయం చేసిన పవిత్ర వృత్తి పద్మశాలీలది. కేవలం ఒక కులంగా కాకుండా, భారతీయ సంస్కృతికి, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన అద్భుతమైన శ్రమజీవుల సమూహం అది.

**కళా నైపుణ్యానికి నిలువెత్తు రూపం.**
ఒక నూలుపోగును పట్టుకుని, దానికి రంగులు అద్ది, మగ్గంపై అడుగడుగునా మేధస్సును, శ్రమను రంగరించి అద్భుతమైన వస్త్రంగా మార్చే పద్మశాలీల హస్తకళా నైపుణ్యం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. తెలంగాణ గడ్డపై పుట్టిన పోచంపల్లి ఇక్కత్ డిజైన్లు, గద్వాల సంప్రదాయ శైలి, నారాయణపేట అంచులు ప్రపంచ యవనికపై తెలుగువారి కీర్తిపతాకాన్ని ఎగురవేశాయి. ఒక నూలుపోగుతో ఐదు గజాల చీరను నేసి, దానిని అగ్గిపెట్టెలో ఇమిడ్చే స్థాయి సాంకేతిక పరిజ్ఞానం మన నేతన్నల సొంతం. శతాబ్దాల కాలంగా వీరు సమాజానికి కేవలం వస్త్రాలను మాత్రమే ఇవ్వలేదు, దేశ సంస్కృతికి ఒక రంగుల హరివిల్లాన్ని బహుమతిగా ఇచ్చారు.

**ఆధునికత తెచ్చిన సంక్షోభం.. కుదేలైన కులవృత్తి**
కాలం మారింది, కానీ నేతన్నల రాత మారలేదు. పారిశ్రామిక విప్లవం, పవర్‌లూమ్స్ (విద్యుత్ మగ్గాలు) రాకతో చేనేతపై ఆధారపడిన లక్షలాది పద్మశాలీ కుటుంబాల బతుకులు రోడ్డున పడ్డాయి. మిల్లు బట్టల పోటీని తట్టుకోలేక, ముడిసరుకుల ధరలు పెరిగి, మార్కెటింగ్ సదుపాయాలు లేక చేనేత కార్మికులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. సిరిసిల్ల లాంటి ప్రాంతాల్లో ఒకప్పుడు నేతన్నల మగ్గాల చప్పుడు వినపడేది, కానీ సంక్షోభం కారణంగా అవి ఆత్మహత్యల శబ్దాలుగా మారడం సమాజ చరిత్రలో ఒక చేదు నిజం. అయినప్పటికీ, పద్మశాలీలు తమ ఆత్మగౌరవాన్ని




వదులుకోలేదు. శ్రమనే నమ్ముకుని, ఎన్నో ఒడిదొడుకులను తట్టుకుని నిలబడ్డారు.

**విద్య, రాజకీయ చైతన్యం వైపు అడుగులు**
మారుతున్న కాలంతో పాటు పద్మశాలీలు కేవలం మగ్గానికే పరిమితం కాకుండా విద్యా, ఉద్యోగ రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారు. నేటి తరం పద్మశాలీ యువత ఆయా శాఖల ప్రభుత్వ ఉద్యోగం,
ఐటీ, వైద్య, ఇంజనీరింగ్, పోలీస్ రంగాల్లో గ్లోబల్ స్థాయిలో రాణిస్తూ సమాజంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటున్నారు. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లోనూ రాణిస్తూ ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు వేస్తున్నారు. జనాభా పరంగా సమాజంలో పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ, రాజకీయంగా ఆశించిన స్థాయిలో ప్రాతినిధ్యం దక్కడం లేదనే అసంతృప్తి ఉన్నా. ఇటీవల కాలంలో పద్మశాలీల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. తమ హక్కుల సాధన కోసం సంఘటితమవుతున్నారు.

**ప్రభుత్వాల చేయూత - సమిష్టి బాధ్యత**
సమాజానికి వస్త్రాలు అందించి సంస్కృతిని కాపాడిన పద్మశాలీల సంక్షేమం కేవలం ఆ కులానికి సంబంధించినది కాదు, అది యావత్ సమాజ బాధ్యత. ప్రభుత్వం నేతన్నల కోసం ప్రవేశపెట్టే బీమా పథకాలు, రాయితీలు, ముడిసరుకుల సరఫరా సక్రమంగా లబ్ధిదారులకు అందాలి. చేనేత ఉత్పత్తులకు ఆధునిక ఈ-కామర్స్ వేదికలను అనుసంధానం చేయడం ద్వారా మధ్యవర్తుల దోపిడీని అరికట్టవచ్చు. ప్రతి ఒక్కరూ వారంలో కనీసం ఒక రోజైనా చేనేత వస్త్రాలను ధరించడం అలవాటు చేసుకుంటే, అది ఆ కుటుంబాలకు ఇచ్చే అతిపెద్ద గౌరవం అవుతుంది.
శాంతి, సహనం, కష్టపడే తత్వం పద్మశాలీల సహజ గుణాలు. సమాజ వికాసంలో తమ చెమట చుక్కలను ధారపోసిన ఈ శ్రమజీవుల ప్రగతి ప్రస్థానానికి ఊతమివ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, తమ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగుతున్న పద్మశాలీ సమాజానికి దేశ భవిష్యత్తులో మరింత ఉన్నతమైన స్థానం లభించాలని ఆకాంక్షిద్దాం. నేతన్నల మగ్గం సజీవంగా ఉన్నంత కాలం.భారతీయ సంస్కృతి వర్ధిల్లుతూనే ఉంటుంది.

సీనియర్ జర్నలిస్ట్
బిర్రు కరుణాకర్
సెల్ ఫోన్ నంబర్
9701249103



# బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

(మొదటి పేజి తరువాయి)
బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. పిటిషనర్ తరపు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకుపైగా జైలులో ఉండటంతో జీవితంలో చాలా కోల్పోయాడన్నారు. పరస్పర అంగీకారంతో జరిగిన దానిపై కేసులు నమోదు చేయడం చెల్లదని.. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు తీర్పుల్లో వెల్లడించాయన్నారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే వాంగ్మూలాల సేకరణ మొదలైందన్నారు. దర్యాప్తు దాదాపు పూర్తికావచ్చిందని, గడువులోగా అభియోగ పత్రాన్ని దాఖలు చేస్తామన్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

# విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్

**విజయవాడ,జులై 9.(జర్నలిస్ట్ వార్త)**



ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఐదో రోజు (గురువారం) ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు.సియోల్‌లో కియా మోటార్స్ గ్లోబల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టే హన్ లీ, ఇతర ఉన్నతాధికారులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ప్రపంచ మార్కెట్ల కోసం విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.అంతకుముందు, సెమీకండక్టర్స్, ఓఎల్ఈడీ డిస్‌ప్లే పరికరాల తయారీ సంస్థ సునిక్ సిస్టమ్ సీఈవో ఎస్.డబ్ల్యూ. చుంగ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో డిస్‌ప్లే పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇందుకు ముందుకొస్తే జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.తన పర్యటనలో భాగంగా లోకేశ్.. దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్-హే సిసిలియా చుంగ్‌తోనూ భేటీ అయ్యారు. ఏపీలో అమలు చేస్తున్న 3ఎ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని వివరించారు. ఏపీ-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్, కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో కోరారు.

# బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్లు

(మొదటి పేజి తరువాయి)
ఇప్పుడూ చేస్తున్నానని తెలిపారు. సింగరేణిలో ఓపెన్ కాస్ట్, అండర్ గ్రౌండ్ మైన్ అనే హెల్త్ మిక్స్ ఉండాలని, అప్పుడే సంస్థ బాగుంటుందన్నారు. సింగరేణిలో ఉద్యోగులు, కార్మికులంతా వన్ విజన్, వన్ ఫ్యామిలీలా ఉంటారని చెప్పారు. కానీ ఇప్పుడు ఆఫీసర్లకు ఒక రూల్, కార్మికులకు ఒక రూల్ నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు.పెండింగ్‌లో ఉన్న రూ.54 వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో సింగరేణి సంస్థ పనిముట్లు కొనుక్కోలేని పరిస్థితికి దిగజారిందని తెలిపారు. వెంటనే బకాయిలు చెల్లించి సంస్థను కాపాడాలని డిమాండ్ చేశారు. బీజేపీ నిర్లక్ష్యం కారణంగా సింగరేణి కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దొడ్డిదారిన ప్రయివేట్ కు ఇచ్చిన తాడిచర్ల-1 మైనింగ్‌ను మళ్లీ సింగరేణికే అప్పగించాలనీ, అప్పుడే కార్మికులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు వచ్చేలా బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను ఎంతో కృషి చేశానని చెప్పారు. నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టి పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలు క్లియర్ చేయాలన్నారు. ముఖ్యమంత్రి రైతుల మీద ప్రేమ ఉన్నట్టు నటిస్తున్నారని ఆరోపించారు. ఆయన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లోనే 90 మంది రైతులపై అక్రమ కేసులు, 9 మంది రైతులపై రౌడీ షీట్లు పెట్టారని చెప్పారు. వెంటనే ఆ కేసులను, రౌడీ షీట్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.'టీఆర్ఎస్ ' పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలని చూస్తే ఆ పేరు రాకుండా ఉండాలని కొందరు కుట్రలు చేస్తున్నారని కవిత ఆరోపించారు.

# పరిశ్రమలకు ఓఆర్ఆర్ బయట భూములు

(మొదటి పేజి తరువాయి)
యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయన్నారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుంది. అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది. 1.34 కోట్ల మంది ఓఆర్ఆర్ లోపల నివసిస్తున్నారు. ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తమ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. అధికారం కోల్పోయిన బాధ ఉన్నా అభివృద్ధిని అడ్డుకోవద్దని, తమ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్న సీఎం.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. అందుకే ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న సుమారు 2,100 చ.కి.మీ. ప్రాంతాన్ని ఏరియాగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్ ప్రాంతాలుగా విభజించి సమతుల అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో 2034 నాటికి రాష్ట్రాన్ని1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

# మూసీ ప్రాజెక్టు మొదటి దశకు ప్రభుత్వం అనుమతి

(మొదటి పేజి తరువాయి)
ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. రూ.2,845 కోట్లు హెచ్ఎండీఏ లేదా టీజీఐఐసీ నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జోన్-1ఏలో హిమాయత్‌సాగర్-బాపూఘాట్ వరకు రూ.3,104 కోట్లతో 9.20 కి.మీ అభివృద్ధి చేయనున్నారు. జోన్-1బీలో ఉస్మాన్ సాగర్-బాపూఘాట్ వరకు రూ.3,950 కోట్లతో 11.80 కి.మీ అభివృద్ధి చేయనున్నారు. ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ నియామకానికి ఎంఆర్‌డీసీఎల్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ భూములు, ప్రయివేటు భూములతో కలిపి మొత్తం రెండు వందల ఎకరాల్లో బాపూఘట్ త్రివేణి సంగమం వద్ద 'గాంధీ సరోవర్ ప్రాజెక్టు'ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇటీవల గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖ 83 ఎకరాలను ఇచ్చింది. అక్కడే గాంధీ సమాధి, మ్యూజియం నిర్మించనుంది. వంద మీటర్ల ఎత్తయిన టవర్, దానిపై 30 మీటర్ల గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనుంది. అందులో ఎడ్యుకేషన్ నాలెజ్జి హబ్, ధ్యాన మందిరం, నేషనల్ మ్యూజియం, పబ్లిక్ రిక్రియేషన్ స్పెసెస్, గాంధీ యూనివర్సిటీ, చేనేత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. మొదటి దశ మూసీ ప్రాజెక్టు 21 కిలో మీటర్లు పూర్త చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# వేలేరు మండలానికి గోదావరి జలాలు తీసుకొస్తాం

## త్వరలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు శంకుస్థాపన: ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**వేలేరు/హనుమకొండ బ్యూరో జూలై 9 (జర్నలిస్ట్ వార్త):** గండి రామారం ఎత్తిపోతల పథకం ద్వారా త్వరలోనే వేలేరు మండలానికి గోదావరి జలాలు తీసుకొచ్చి రైతులకు రెండు పంటలకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. గురువారం శాలపల్లి, లక్ష్మీతండా, బంగ్లాపల్లి, గొల్లకిష్టంపల్లి గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

శాలపల్లి, లక్ష్మీతండా, బంగ్లాపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లు, మహిళా సమాఖ్య భవనాలు, గొల్లకిష్టంపల్లిలో గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం వేలేరు మండలానికి చెందిన 11 మంది కల్యాణలక్ష్మిషాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.11.01 లక్షలు, 20 మంది ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు రూ.5.87 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాలపల్లి గ్రామాన్ని పైలట్ గ్రామంగా అభివృద్ధి చేస్తున్నామని, రెండున్నరేళ్లలోనే రూ.4 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వేలేరుపీచర, పీచరలోక్యతండా రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. గండి రామారం లిఫ్ట్-1 పనులు పూర్తయిన వెంటనే వేలేరు మండలానికి గోదావరి జలాలు అందిస్తామని పేర్కొన్నారు.

కొత్తగా ఏర్పడిన వేలేరు మండలానికి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు మంజూరయ్యాయని, త్వరలోనే శంకుస్థాపన నిర్వహిస్తామని తెలిపారు. గొల్లకిష్టంపల్లి కస్తూర్బా పాఠశాల అభివృద్ధికి రూ.5.25 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని, గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి చేరుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

## సీఎంను కోరిన టీఎన్‌టీయూసీ నాయకుడు వాసిరెడ్డి భాస్కరరావు




**ఖమ్మం/, జూలై 9: (జర్నలిస్ట్ వార్త)** ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలని టీడీపీ అనుబంధ టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు వాసిరెడ్డి భాస్కరరావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ 2017 నుంచి 2023 వరకు సుమారు 20 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందినా వారికి రావాల్సిన ప్రయోజనాలు ఇప్పటికీ అందలేదని అన్నారు. రిటైర్మెంట్ అనంతరం రావాల్సిన నగదు అందక పలువురు ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సుమారు 400 మంది ఉద్యోగులు బకాయిలు అందుకోకుండానే మృతి చెందారని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితమంతా కష్టపడి పనిచేసిన కార్మికులకు న్యాయబద్ధంగా రావాల్సిన ప్రయోజనాలను ఆలస్యం చేయడం సరికాదన్నారు. ప్రస్తుతం చాలామంది రిటైర్డ్ ఉద్యోగులు స్వల్ప పెన్షన్‌తోనే జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని, 2019 సమ్మె సమయంలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను విడుదల చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మం పర్యటన సందర్భంగా ఈ అంశంపై శుభవార్త ప్రకటించాలని కోరారు. విలేకరుల సమావేశంలో పాలడుగు కృష్ణప్రసాద్, బోయిన వెంకన్న, పొదిల శ్రీను, బోడెపూడి రవి, కొండబాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ పాఠశాలను తనిఖీ ఎంపిడివో..





**బయ్యారం/,జులై 9.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం జగ్గుతండా పంచాయతీలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఎంపిడివో దీపిక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ప్రతి తరగతి గదిని సందర్శించి విద్యార్థినులతో ఆప్యాయంగా ముచ్చటించారు. చదువుపైనే పూర్తి దృష్టి సారించాలని, ఉన్నత విద్యతోనే జీవితంలో మంచి అవకాశాలు లభిస్తాయని విద్యార్థినులకు సూచించారు. చదువులో మెళకువలు, లక్ష్య సాధనకు అవసరమైన అంశాలను తెలియజేసి విద్యార్థినుల్లో ఉత్సాహం నింపారు. తనిఖీలో భాగంగా పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఆహార నాణ్యత,పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లి జయంతి వెంకట కృష్ణ,కేజీబీవీ పాఠశాల టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ కేంద్రాల్లోనూ ఇకపై యూరియా బుకింగ్.

## -వ్యవసాయ అధికారి కే.రాజు.




**బయ్యారం,జులై 9.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని కొత్తపేట మీ సేవా కేంద్రంలో గురువారం కీప్యాడ్ మొబైల్ ఫోన్‌లు ఉపయోగిస్తున్న రైతులు,మొబైల్ నెట్‌వర్క్ సౌకర్యం లేని గ్రామాలకు చెందిన రైతులకు యూరియా బుకింగ్ విధానంపై అవగాహన కల్పించడంతో పాటు, కొంతమందికి రైతులకు మీ సేవా కేంద్రం ద్వారా యూరియా బుకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు యూరియా బుకింగ్ విధానం, దాని ప్రయోజనాలు,నిర్ణీత సమయంలో ఎరువులను పొందేందుకు బుకింగ్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. స్మార్ట్‌ఫోన్,మొబైల్ నెట్‌వర్క్ సౌకర్యం లేని రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సమీపంలోని మీ సేవా కేంద్రాలను వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కే.రాజు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ విధానాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైనప్పుడు మీ సేవా కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవాలని కోరారు.

# రహదారిపై బురద ముప్పు

## ఊకల్ క్రాస్ వద్ద తప్పిన ప్రమాదాలు!

## సమయస్ఫూర్తి చాటిన గీసుగొండ పోలీసులు



రోడ్డు మీద ఉన్నమట్టిని పారతో క్లీన్ చేస్తున్న సిఐ విశ్వేశ్వర్, ఎస్సై అనిల్ లు



**గీసుగొండ/జులై 9(జర్నలిస్ట్ వార్త):** అటుగా వెళ్తున్న వాహనదారులకు అడుగడుగునా మృత్యుపాశంలా మారిన రహదారిపై గీసుగొండ పోలీసులు దేవుడిలా స్పందించారు. వరంగల్-నర్సంపేట ప్రధాన మార్గంలోని ఊకల్ క్రాస్ వద్ద లారీ పార్కింగ్ స్థలం నుంచి రోడ్డుపైకి చేరిన బురద వాహనదారులను వణికించింది. జారుడుగా మారిన రహదారిపై ఏ నిమిషానికి ఏ వాహనం అదుపు తప్పుతుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. ఈ ప్రమాదకర పరిస్థితిని గీసుగొండ సీఐ విశ్వేశ్వర్, ఎస్ఐ అనిల్ ముందే పసిగట్టారు. కేవలం లా అండ్ ఆర్డర్ చూసుకోవడమే కాకుండా, ప్రజల ప్రాణాల రక్షణే ధ్యేయంగా వారు వెంటనే రంగంలోకి దిగారు. స్థానికులను సమన్వయం చేసుకుంటూ స్వయంగా పర్యవేక్షించి రోడ్డుపై పేరుకుపోయిన బురద, వ్యర్థాలను పూర్తిగా క్లీన్ చేయించారు.

**నిర్వాహకులకు గట్టి హెచ్చరిక..**

మళ్లీ ఇలాంటి నిర్లక్ష్యపు పరిస్థితులు పునరావృతమైతే సహించేది లేదని లారీ పార్కింగ్ యాజమాన్యాలకు పోలీసులు గట్టి వార్నింగ్ ఇచ్చారు. రహదారులపై ఎక్కడైనా ప్రమాదకర ఆటంకాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఖాకీల సకాల స్పందనతో పెద్ద ప్రమాదమే తప్పిందంటూ స్థానిక ప్రజలు, వాహనదారులు పోలీసులపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

# ఇందిరానగర్‌లో మెగా వైద్య శిబిరం

## ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ.. గ్రామస్తుల విశేష స్పందన



**ఎల్కతుర్తి, /జూలై 9:( జర్నలిస్ట్ వార్త)**మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య నేతృత్వంలోని వైద్య బృందం గ్రామస్తులకు రక్తపోటు, మధుమేహం, జ్వరం తదితర సాధారణ ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేసింది. శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు పరిశుభ్రతే ప్రధానమన్నారు. గ్రామంలో నీరు నిల్వ లేకుండా చూడాలని, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గబ్బిటి స్వామి, ఏఎన్ఎంలు స్వరూపరాణి, పుష్పలత, ఆశా కార్యకర్త మాధవి, గ్రామస్థులు పాల్గొన్నారు

# అరుణోదయ నాగన్నకు విప్లవ జోహార్లు.



**బయ్యారం/,జులై 9.(జర్నలిస్ట్ వార్త)**సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు అరుణోదయ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు విప్లవ సాంస్కృతిక యోధుడు కామ్రేడ్ నాగన్న అనారోగ్యంతో జులై 3న మృతి చెందారు. ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ జూలై 3 నుండి 11 వరకు సంతాప సభలు నిర్వహించాలని పిలుపులో భాగంగా గురువారం వెంకట్రాంపురంలో దొరన్న స్మారక భవన్ లో నందగిరి సత్యం అధ్యక్షతన సంతాప సభ నిర్వహించి కామ్రేడ్ నాగన్నకు విప్లవ నివాళు లర్పించారు. బాలాజీ పేటలో కామ్రేడ్ గుడి బోయిన రమేష్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించి కామ్రేడ్ నాగన్నకు సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సంతాప సభలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు,పార్టీ డివిజన్ నాయకులు తోకల వెంకన్నలు మాట్లాడుతూ కామ్రేడ్ అరుణోదయ నాగన్న ఖమ్మం జిల్లాలో జన్మించి గత 50 సంవత్సరాలుగా ఆయన కాలికి గజ్జ కట్టి పీడిత ప్రజల కష్టాలను,అమరుల త్యాగాలను గానం చేస్తూ తెలుగు నేలను చుట్టూ వచ్చాడన్నారు. విప్లవ సాంస్కృతిక ఉద్యమ నాయకులు అమరులు కానూరు వెంకటేశ్వరరావు అరుణోదయ రామారావుల సహచర్యంతో ఉద్యమ గానమై ఊరూరు తిరిగాడు విప్లవ సంస్కృతిక ఉద్యమానికి కామ్రేడ్ నాగన్న అందించిన అజరామర కృషికి వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లం సోమక్క,వల్లాల బిక్షం,తూముల నరసింహారావు,కొత్త రాందాస్,నిమ్మరబోయిన సహదేవు, భూక్య నాగేశ్వరరావు,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ బీఎల్‌ఏల జాబితా సమర్పణ



**మధిర,/ జూలై 9 (జర్నలిస్ట్ వార్త):** ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమంలో భాగంగా మధిర టౌన్ మున్సిపాలిటీ, మధిర రూరల్ మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు టీడీపీ తరఫున నియమించిన బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్‌ఏలు) జాబితాను గురువారం అధికారులకు అందజేశారు. ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం సమక్షంలో మధిర తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు బీఎల్‌ఏల వివరాలను సమర్పించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బూత్ లెవల్ అధికారులకు సహకరించేందుకు బీఎల్‌ఏలను నియమించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మధిర టౌన్ టీడీపీ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు, మధిర రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు మార్నీడు పుల్లారావు, టౌన్ కార్యదర్శి చట్టు వెంకటేశ్వరులు, 17వ వార్డు కౌన్సిలర్ ములకలపల్లి వినాయకుమార్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు

# వధూవరులను ఆశీర్వదించిన నారపోగు కుటుంబ సభ్యులు



**గంపలగూడెం/, జూలై 9 (జర్నలిస్ట్ వార్త):** గంపలగూడెం మండలం నెమలి గ్రామంలో బొల్లెపోగు నాగార్జునగీత దంపతుల కుమారుడు అశోక్ వివాహం స్రవంతితో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు నారపోగు రమేష్‌బాబు, అరుణ దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వధూవరులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందమైన దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దుబ్బాకుల రహిమాన్, వసంత, నారపోగు ప్రసాద్‌బాబు, నారపోగు రాణి, నారపోగు అక్కమ్మ, కృష్ణార్జునరావు, సుష్మ, అనూష, రిత్విక్, భార్గవి, సైదమ్మతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పలు వివాహ వేడుకల్లో స్కైలాబ్ నాయక్ సందడి





**మిర్యాలగూడ/ జూలై 9 (జర్నలిస్ట్ వార్త);**
మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో గురువారం నిర్వహించిన పలు వివాహ వేడుకల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు స్కైలాబ్ నాయక్ పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా స్కైలాబ్ నాయక్ మాట్లాడుతూ నూతన దంపతులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో చిరకాలం ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తూ ఆదర్శ దాంపత్య జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గవర్నర్‌ను కలిసిన టీపీసీసీ చీఫ్ అశోక్ రెడ్డి

## వరంగల్‌లో మర్యాదపూర్వక భేటీ.. రాష్ట్ర అభివృద్ధి అంశాలపై చర్చ



**ఎల్కతుర్తి/ జూలై 9 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలానికి చెందిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మనపెల్లి అశోక్ రెడ్డి గురువారం వరంగల్‌లోని ఎన్ఐటీ అతిథి గృహంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు శాలువా కప్పి సన్మానించిన అశోక్ రెడ్డి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, విద్యా రంగానికి సంబంధించిన పలు అంశాలపై సంక్షిప్తంగా చర్చించినట్లు సమాచారం. ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై అభిప్రాయాల మార్పిడి జరిగినట్లు తెలిసింది. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# యాదాద్రి థర్మల్ ప్రైవేటీకరణ నిలిపివేయాలి

## ఆర్డీవోకు సేవాలాల్ సేన వినతి




**దామరచర్ల/ జూలై 9 (జర్నలిస్ట్ వార్త);** దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ధనావత్ ప్రకాష్ నాయక్ కోరారు. ఈ మేరకు మండల పర్యటనకు వచ్చిన ఆర్డీవో రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, పూర్తిస్థాయిలో చేపట్టాలని కోరారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు తగిన నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అటవీ హక్కు పత్రాలు కలిగి సాగు చేస్తున్న గిరిజనులను అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ మోహన్ నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు దసరా నాయక్, వీరా నాయక్, సచిన్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరానగర్‌లో మెగా వైద్య శిబిరం

## ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ.. గ్రామస్తుల విశేష స్పందన



**ఎల్కతుర్తి/జూలై 9( జర్నలిస్ట్ వార్త);** మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య నేతృత్వంలోని వైద్య బృందం గ్రామస్తులకు రక్తపోటు, మధుమేహం, జ్వరం తదితర సాధారణ ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేసింది. శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు పరిశుభ్రతే ప్రధానమన్నారు. గ్రామంలో నీరు నిల్వ లేకుండా చూడాలని, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గబ్బిటి స్వామి, ఏఎన్‌ఎంలు స్వరూపరాణి, పుష్పలత, ఆశా కార్యకర్త మాధవి, గ్రామస్థులు పాల్గొన్నారు

# కట్ర్యాల గ్రామంలో బిజెపి యువ నాయకుడు సురేష్‌కు ఘన నివాళి




**వర్ధన్నపేట/ జూలై 9 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని కట్ర్యాల గ్రామానికి చెందిన బిజెపి యువమోర్చా నాయకుడు కీ.శే. చెంగల సురేష్ ప్రథమ వర్ధంతి వేడుకలను ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా, మండల స్థాయి నాయకులు సురేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సురేష్ పార్టీ బలోపేతానికి చేసిన సేవలను నాయకులు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, జిల్లా నాయకులు కుందూరు మహేందర్ రెడ్డి, సుల్తాన్ రాజు, మండల నాయకుడు వడ్డే దేవేందర్ , పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: భట్టి





**చింతకాని/ జూలై 9 (జర్నలిస్ట్ వార్త)** : రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో గురువారం నిర్వహించిన మెగా రైతు మేళాలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతులకు విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు అండగా నిలుస్తోందని భట్టి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన రాష్ట్రం తెలంగాణేనని పేర్కొన్నారు. ధాన్యం, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటున్నామని చెప్పారు. రైతులు తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయంతో పాటు ఉద్యానవనం, మత్స్య, పశుసంవర్ధక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వ్యవసాయ ఆధునికీకరణ కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని, ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. భారీగా రైతుల హాజరువ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జూలై 10న నిర్వహించే రైతు ఆశీర్వాద సభ తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు సభగా నిలుస్తుందని అన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మొక్కజొన్న, జొన్న, సోయా వంటి పంటలకు కూడా మద్దతు ధర కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మాట్లాడుతూ మెగా రైతు మేళా కోసం 150 స్టాల్స్ ఏర్పాటు చేశామని, ఐదు వేల మంది రైతులు వస్తారని అంచనా వేయగా సుమారు 11 వేల మంది రైతులు హాజరయ్యారని వెల్లడించారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతిక పరికరాల ప్రదర్శన రైతులను ఆకట్టుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ప్రకృతి వైద్యమే మానవాళికి మనుగడ

## విద్యా వైద్య అవగాహన సదస్సులో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం





**హన్మకొండ/జులై 9 (జర్నలిస్ట్ వార్త);** (యూనివర్సిటీ క్యాంపస్): ప్రకృతిని క్రమ పద్ధతిలో ఉపయోగించుకుంటే ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా, రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యంగా ఉండొచ్చని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం అన్నారు. కేయూ రాజనీతి శాస్త్ర విభాగం అలుమ్నీ హాల్‌లో డాక్టర్ సంకినేని వెంకట్ అధ్యక్షతన జరిగిన విద్యా వైద్య అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేస్తూ ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకోవాలని, ఇందుకు ప్రభుత్వాలు కూడా ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. ముఖ్య వక్త, ప్రాకృతిక వైద్యులు డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి గొప్పతనం తెలియక చాలామంది ఫార్మా మందుల కోసం డబ్బులు వెచ్చించి ఆర్థికంగా చిన్నాభిన్నమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంటింట్లో ఉండే పోపుల పెట్టెలోని దినుసులే మన రోగాలను నయం చేసే అద్భుత ఔషధాలని, వాటిని మరచి ఆసుపత్రుల చుట్టూ పరుగులు తీస్తున్నామని పేర్కొన్నారు. 40 ఏళ్లు దాటితేనే బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడుతున్నారని, భవిష్యత్తులో సగటు జీవన ప్రమాణం 50 ఏళ్లకు పడిపోయే ప్రమాదం ఉందన్నారు. శరీరానికి శ్రమ కల్పిస్తూ, నిత్యం వాకింగ్, వ్యాయామాలు చేస్తూ ప్రకృతితో సహజీవనం సాగించాలి. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందనే విషయాన్ని గ్రహించాలని డాక్టర్ కోటేశ్వరరావు, ప్రాకృతిక వైద్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గడ్డం కృష్ణయ్య, పి.వి. నాలెడ్జ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ మామిడి లింగయ్య, కేయూ పాలకమండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు, డిప్సా అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు, డాక్టర్ రాధిక, సామాజిక కార్యకర్త బొడ్డు దయాకర్, రీసెర్చ్ స్కాలర్ అంకిల శంకర్, డాక్టర్ కల్లేపల్లి ప్రశాంత్ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# వెంచర్ల జోరు..

# నిబంధనల అమలు ఎంతవరకు?

### ధర్మసాగర్, ఉనికిచెర్ల, ఎల్కుర్తిలో వేగంగా విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు

### అనుమతులు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణపై అధికారుల దృష్టి సారించాలని ప్రజల విజ్ఞప్తి

### ప్లాట్లు కొనుగోలు చేసే ముందు అన్ని పత్రాలు పరిశీలించాలని నిపుణుల సూచన



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 9 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ధర్మసాగర్, ఉనికిచెర్ల, ఎల్కుర్తి గ్రామాలు ఇటీవల రియల్ ఎస్టేట్ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలుగా మారుతున్నాయి. వరంగల్ నగరానికి సమీపంలో ఉండటం, రహదారి సౌకర్యాలు మెరుగుపడటం, భూముల విలువ పెరగడం వంటి కారణాలతో ఈ ప్రాంతాల్లో ప్లాట్ల కొనుగోలు, విక్రయాలపై ఆసక్తి పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో వ్యవసాయ భూములను నివాస అవసరాలకు అనువుగా మార్చి వెంచర్లుగా అభివృద్ధి చేసే ప్రయత్నాలు కూడా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, అభివృద్ధి చెందుతున్న ప్రతి వెంచర్ సంబంధిత చట్టాలు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉందా అనే అంశాన్ని అధికారులు సమగ్రంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. లేఅవుట్ అనుమతులు, భూ వినియోగ మార్పు, రహదారులు, డ్రైనేజీ, పార్కులు, ఓపెన్ స్పేస్ వంటి మౌలిక సదుపాయాలు నిబంధనల మేరకు కల్పించబడుతున్నాయా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో గజం రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ధరలు చెబుతున్నట్లు వినిపిస్తోంది. అయితే ధరలు పెరగడమే కాకుండా, కొనుగోలుదారులు పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత లేఅవుట్ ఆమోద పత్రాలు, భూమి యాజమాన్య వివరాలు, అనుమతులు, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అంశాలను పూర్తిగా పరిశీలించుకోవడం అవసరమని న్యాయ, రెవెన్యూ రంగాల నిపుణులు సూచిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందడం ప్రాంత ఆర్థిక వ్యవస్థకు అనుకూలమే అయినప్పటికీ, అది పూర్తిగా చట్టబద్ధమైన విధానంలో సాగితేనే కొనుగోలుదారుల హక్కులు, ప్రభుత్వ ప్రయోజనాలు రెండూ పరిరక్షించబడతాయి. సంబంధిత అనుమతులు లేకుండా లేఅవుట్లు అభివృద్ధి చేయడం లేదా నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల విక్రయాలు జరిగితే భవిష్యత్తులో కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన అభివృద్ధి చార్జీలు, ఫీజులు, ఇతర ఆదాయాలు పూర్తిస్థాయిలో అందుతున్నాయా అనే అంశాన్ని కూడా సంబంధిత శాఖలు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే వ్యవసాయ భూముల వినియోగ మార్పు, ప్రభుత్వ పథకాల అర్హత, రెవెన్యూ రికార్డుల నవీకరణ వంటి అంశాలపై కూడా సమగ్ర తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ధర్మసాగర్ మండలంలో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ విస్తరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో, జిల్లా పరిపాలన రెవెన్యూ, జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డి టీ సి పి), పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్ శాఖలతో కూడిన సంయుక్త ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వెంచర్లను పరిశీలిస్తే పారదర్శకత పెరుగుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అనుమతులు ఉన్న వెంచర్ల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా కొనుగోలుదారులు కూడా సరైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. కొనుగోలుదారులు గుర్తుంచుకోవాల్సిన అంశాలువెంచర్‌కు సంబంధిత లేఅవుట్ ఆమోదం ఉందా? భూమి యాజమాన్య పత్రాలు స్పష్టంగా ఉన్నాయా? రోడ్లు, డ్రైనేజీ, ఓపెన్ స్పేస్ వంటి సదుపాయాలు ఆమోదిత ప్రణాళిక ప్రకారమే ఉన్నాయా? భూమిపై ఎలాంటి వివాదాలు లేదా చట్టపరమైన పరిమితులు లేవని నిర్ధారించుకున్నారా? ప్రజల పెట్టుబడులు సురక్షితంగా ఉండాలంటే, అలాగే ప్రభుత్వ నిబంధనలు సమర్థంగా అమలు కావాలంటే సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, అవసరమైతే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.